సాక్షి నిర్మల్
శుక్రవారం : 28 : జూన్ : 2024



చట్టాలు.. సరికొత్తగా..

జూలై 1 నుంచి చట్టాలలో భారీ మార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో ప్రభుత్వం భారీ మార్పులు చేసింది. 8లో▸



సర్కారు బడికీ ఫ్రీ కరెంటు

రాష్ట్ర ప్రభుత్వం గృహావసరాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించింది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /26.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాలు, ఉపరితల ద్రోణి ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఈవీఎంల గోదాం తనిఖీ



ఈవీఎం రికార్డు పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ రూరల్ మండలం ఎల్లపల్లి వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం తనిఖీ చేశారు. తాళానికి వేసిన సీల్, సీసీ కెమెరాలో రికార్డు అవుతున్న విధానాన్ని పరిశీలించారు. తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాం వద్ద పటిష్ట పర్యవేక్షణ, నిఘా కొనసాగించాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. తనిఖీ నివేదికను ఎన్నికల సంఘం కార్యాలయానికి పంపించాలని ఎన్నికల సెక్షన్ పర్యవేక్షకులకు తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నిర్మల్, భైంసా, ఉట్నూర్ ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, వివిధ పార్టీల ప్రతినిధులు శ్రావణ్‌రెడ్డి, సయ్యద్ హైదర్, రమేశ్, రెవెన్యూ, పోలీసు అధికారులు ఉన్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయాలి

- ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: మహిళలు, యువతులు, బాలికలు ఏ విధమైన వేధింపులకు గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇటీవలే జిల్లా కేంద్రంలోని విద్యార్థినులు సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో కొందరు ఆకతాయిలు వేధిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. దీంతో షీటీం బృందం అక్కడికి చేరుకుని ఆకతాయిలను మందలించి సమస్య పరిష్కరించినట్లు పేర్కొన్నారు. బాధితులు నేరుగా షీటీం నంబర్ 8712659550కు ఫోన్‌చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాలి



డీటీడీవోకు వినతి పత్రం ఇస్తున్న వెంకట్రావ్

ఖానాపూర్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో డీటీడీవో అమిత్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాలికల ఆశ్రమ పాఠశాలల్లో మహిళా ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గిరిజన స్పోర్ట్స్ స్కూల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రతీనెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు.

సీనియారిటీ జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

తానూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ఎస్జీటీల బదిలీల్లో సీనియారిటీ జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ కోరారు. కొంతమంది ఉపాధ్యాయులు స్పెషల్ కేటగిరీ పాయింట్లు, స్పౌజ్ పాయింట్లు, పాఠశాలలో చేరిన తేదీల్లో తప్పుడు సమాచారం ఇచ్చి సీనియారిటీ జాబితాలో ముందు వరసలో ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో అర్హులు నష్టపోతారని తెలిపారు. తప్పుడు సమాచారం ఇచ్చేవారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్జీటీలు ఎక్కువగా ఉన్నందున ఆప్షన్స్ ఇవ్వడంలో ఇబ్బందిపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రోజుకు 250 చొప్పున విడతలవారీగా ఆప్షన్లు ఇచ్చేలా చూడాలని కోరారు. 250 మంది బదిలీ ప్రక్రియ పూర్తయ్యాక మరో 250 మందికి అవకాశం ఇవ్వాలని తెలిపారు.

జాతీయ రహదారి పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఈఈ రవీందర్

ముధోల్: బోధన్ నుంచి భైంసా వరకు చేపట్టిన జాతీయ రహదారి పనులను ముధోల్ మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈఈ వెంట సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్, నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

శ్రీరామా.. గోడు వినేదెవరు?

- అభివృద్ధికి దూరంగా ఎస్సారెస్పీ పునరావాస గ్రామాలు
- ప్రాజెక్టు కోసం చేసిన త్యాగానికి దక్కని ఫలితం
- మౌలిక వసతుల కల్పనలో అధికారులు, పాలకుల నిర్లక్ష్యం
- సమస్యలతో సహవాసం చేస్తున్న పల్లె ప్రజలు



ఎలాంటి అభివృద్ధి లేని ఎస్సారెస్పీ పునరావాస గ్రామం రాయపూర్‌కాండ్లీ

లోకేశ్వరం: వారంతా వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు కోసం తమ భూములను త్యాగం చేశారు. ఉపాధి కోల్పోయినా.. లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని భావించారు. తమ త్యాగానికి గుర్తింపు ఉంటుందని అనుకున్నారు. ప్రభుత్వం తగిన పరిహారం ఇస్తుందని అంచనా వేశారు. తమ ఊళ్లను కూడా అభివృద్ధి చేస్తారని అనుకున్నారు. కానీ, నాలుగు దశాబ్దాలు గడిచాయి. భూములు ఇచ్చిన వారి బాధలు తీరలేదు. ఇక పునరావాస గ్రామాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదు. పరిహారం కూడా చాలా మందికి ఇవ్వలేదు. ఇక అధికార యంత్రాంగం అయితే ఆ గ్రామాలవైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదీ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల పరిస్థితి.

1978లో నిర్మాణం..

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు. 1978లో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. దీంతో నిర్మల్ జిల్లాలోని పలు గ్రామాలను ప్రాజెక్టు ముంపు గ్రామాలుగా అప్పుడే గుర్తించారు. ప్రాజెక్టు కోసం రైతుల నుంచి భూములు సేకరించారు. నిర్వాసితులకు పునరావాసం కల్పించి ఆ గ్రామాలను ఆధునిక పద్ధతిలో అభివృద్ధి చేస్తామని, భూములు కోల్పోయిన వారికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు.

34 ముంపు గ్రామాలు...

జిల్లాలోని లోకేశ్వరం మండలంలో 19 గ్రామాలు, దిలావర్‌పూర్ మండలంలో 7, బాసర మండలంలో 6, సర్నాపూర్ (జి), ముధోల్ మండలంలో ఒక్కో గ్రామం ఎస్సారెస్పీలో ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టు కోసం ఈ 34 గ్రామాల ప్రజలు తమ భూములను ఇచ్చారు. నాడు ఎకరాకు రూ.600 నుంచి రూ.800 చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించింది. అయితే ఇప్పటికీ ఆ పరిహారం కూడా చాలా మందికి అందలేదు. ముంపునకు గురయ్యే ఇళ్లకు కూడా అంతంత మాత్రంగానే పరిహారం చెల్లించారు. పరిహారం పెంచాలని ఏళ్లుగా నిర్వాసితులు పోరాడినా ఫలితం లేకుండాపోయింది. ఇక నిర్వాసితులకు ప్రభుత్వం మరోచోట ఐదెకరాల చొప్పున సాగు భూమి కేటాయించింది. అయితే అందులో రాళ్లు రప్పలు ఉండడంతో ఇప్పటికీ చాలా ఎకరాలు సాగుచేయలేదు.

నాసిరకం పనులు..

పునరావాస గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లోనూ నాణ్యత లోపించింది. కొన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు కూడా నిర్మించలేదు. పునరావాస గ్రామాలు ఏర్పడి నాలుగు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ చాలా గ్రామాల్లో రోడ్లు లేవు. లోకేశ్వరం మండల కేంద్రానికి వెళ్లే అర్లి ఎక్స్‌రోడ్డు వంతెన శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అయినా పట్టించుకునేవారు లేరు. హావర్గ, అర్లి, గొడిసెరా రోడ్లు అధ్వానంగా మారాయి.



వట్టోలిలో అసంపూర్తిగా పాఠశాల భవనం

అభివృద్ధి అంతంతే..

పునరావాస గ్రామాల్లో అభివృద్ధి కూడా అంతంత మాత్రంగానే ఉంది. 34 గ్రామాల్లో చాలా ఊళ్లకు పంచాయతీ భవనాలు లేవు. పునరావాస గ్రామాల్లో చేపట్టిన ఆలయాల నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. లోకేశ్వరం మండలం పంచగుడి, గడ్‌చాంద్, పిప్రి, కన్కాపూర్, అబ్దుల్లాపూర్, అర్లి, గొడిసెరా, రాయపూర్ కాండ్లీ, రాజూరా, మన్మద్, పోట్‌పల్లి, ఎడ్బూర్, జోహర్‌పూర్, వట్టోలి, సాథ్‌గాం, హద్దిగాం, నుర్లి, మొహాళ, హావర్గ, గ్రామాల ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. సాథ్‌గాం, హద్దిగాం, మన్మద్ గ్రామాలు ఇటు సుద్దవాగు ముంపునకు గురైనా బాధితులకు పరిహారం ఇవ్వలేదు.

ముంపు భూముల్లో సాగు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు ముంపునకు గురైన భూముల్లో నిర్వాసితులు పంటలు సాగు చేస్తున్నారు. పరిహారం పెంచాలని ఎన్నిసార్లు కోరినా పాలకులు స్పందించకపోవడంతో ముంపు భూములను నిర్వాసితులు స్వాధీనం చేసుకుని పంటలు పండించుకుంటున్నారు. కొందరు రైతులు ముంపు భూములను విక్రయిస్తున్నారు. ఆ భూముల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

నిధులు మంజూరు చేయాలి..



ఎస్సారెస్పీ పునరావాస గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి. మౌలిక సదుపాయాలు కల్పించాలి. ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన వారికి పరిహారం పెంచి ఇవ్వాలి.

– దడిగే రాజేశ్వర్, వట్టోలి

పూర్తి పరిహారం చెల్లించాలి..



ఎస్సారెస్పీ కోసం భూములు, ఇళ్లు ఇచ్చిన వారికి ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. ప్రాజెక్టు కోసం మా విలువైన భూములు కోల్పోయాం. ఇప్పటికైనా అధికారులు పరిహారం పెంచి ఇవ్వాలి.

– నాలం గంగాధర్, రాయపూర్‌కాండ్లీ

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

జిల్లాలోని ఎస్సారెస్పీ పునరావాస గ్రామాల్లో సమస్యలు, అభివృద్ధి పనుల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రోడ్లు, అర్లి వంతెన, గ్రామాల్లో వసతుల కల్పనకు నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ఎస్సారెస్పీ భూములను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం.

– చక్రపాణి, ఎస్సారెస్పీ ఈఈ

పెంబి మండల అభివృద్ధికి కృషి



సమీక్షలో కలెక్టర్, అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: నీతిఆయోగ్ ప్రతిపాదిత ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన పెంబి మండలాన్ని అధికారులు సమన్వయంతో ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పెంబి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై గురువారం సమీక్ష నిర్వహించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పశుపోషణ, మౌలిక సదుపాయాలుసహా వివిధ అంశాల సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల వివరాలను శాఖల వారీగా అడిగి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతిఆయోగ్ ప్రతిపాదిత ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వందశాతం అమలు చేయాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు శాతం పెంచాలని సూచించారు. కేంద్రాల్లో పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం చిన్నారులకు అందించాలని తెలిపారు. పిల్లల ఎదుగుదల, ఇతర వివరాలను పోషణ ట్రాకర్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులందరూ పై చదువులకు కళాశాలల్లో ప్రవేశాలు పొందేలా ప్రోత్సహించాలని సూచించారు. మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ అందించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమాకాంత్, సీడీపీవో సరిత, ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్ రూరల్: రాష్ట్రంలోని క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 20 మంది బాలురు, 20 మంది బాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జూలైలో హకీంపేట పాఠశాలలో నిర్వహించే ఎంపిక పోటీల్లో వీరు పాల్గొంటారు. విజేతలకు క్రీడా పాఠశాలలో ప్రవేశం కల్పిస్తారు. ఇందులో ఇన్‌చార్జి డీవైఎస్‌వో నఫీజాన్, పెటా జిల్లా అధ్యక్షుడు భూక్య రమేశ్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి రమణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, భూమన్న, లక్ష్మణ్, రామారావు, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి తాత్కాలిక పద్ధతిలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జే.భీమారావు తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో బోధనకు గణితశాస్త్రం–1, కంప్యూటర్ సైన్స్–2, పొలిటికల్ సైన్స్–1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–1 పోస్టు ఉన్నట్లు వివరించారు. ఉర్దూ మీడియంలో ఉర్దూ–1, హిస్టరీ–1, బోటనీ–1, కెమిస్ట్రీ–1 ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బోధనా అనుభవం ఉంటే అదనపు అర్హతగా పరిగణిస్తామని తెలిపారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో జూలై 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ, డెమో క్లాసు ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

- హాజరుకానున్న పలు రాష్ట్రాల పరిశోధకులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్ అభిలాష అభినవ్, కీనోట్ స్పీకర్‌గా డాక్టర్ ఎల్.రాజేందర్‌రెడ్డి హాజరు కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే.భీమారావు తెలిపారు. 'సుస్థిరాభివృద్ధిలో రసాయన, అనుబంధ శాస్త్రాల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, అధ్యాపకులు హాజరై తాము పరిశోధించిన అంశాలపై ఆవిష్కరణ పత్రాలను సమర్పిస్తారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ఇప్పటి వరకు 76 పరిశోధన పత్రాలు అందినట్లు సదస్సు సమన్వయకర్త సరితరాణి, కోకన్వీనర్ రమాకాంత్‌గౌడ్ తెలిపారు.

కడెం కుడి కాలువకు మరమ్మతులు

కడెం: కడెం ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతు పనులు గురువారం ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట గల కుండీల వద్ద బుంగకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నట్లు డీఈ బోజదాసు తెలిపారు. నీటి విడుదల చేసేలోగా పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

కడెం @ 676.800

కడెం: కడెం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. గురువారం 676.800 అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి 900 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సోన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. సోన్ మండలం గాంధీనగర్, పాక్‌పట్ల గ్రామాల్లో ఎంపీడీవో సురేశ్‌తో కలిసి గురువారం పర్యటించారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ముసురుకునే ప్రమాదం ఉందని తెలిపారు. వీధుల్లో, ఇంటి ఆవరణలో నీరు నిలవకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు. అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గాంధీనగర్ గ్రామంలో డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల్లో చేరి చికిత్స తీసుకున్న విషయాన్ని అధికారులకు గుర్తుచేశారు. వారివెంట కార్యదర్శులు సంధ్య, సంగీత, అంగన్‌వాడీ టీచర్లు వినోద, సలోని, ఆశ వర్కర్లు, నాయకులు గంగారెడ్డి, బాలకృష్ణ, బస్వరాజ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ధీ(బీ)మా లేని బతుకులు!



ఈ చిత్రంలో కనిపిస్తున్నది లక్ష్మణచాంద మండలం చింతల్‌చాంద గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుడు సాయికృష్ణ కుటుంబానిది. మంగళవారం గ్రామంలో వీధి లైట్లు అమరుస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కుగురయ్యాడు. నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు కూడా భారంగా మారాయి. కృష్ణ భార్య అప్పులు చేసి చికిత్స చేయిస్తోంది.

- గాలిలో దీపంలా పంచాయతీ కార్మికుల జీవితాలు
- విధి నిర్వహణలో ఏం జరిగినా అందని సాయం
- అటకెక్కిన గత ప్రభుత్వ బీమా హామీ
- భద్రత కల్పించాలని కోరుతున్న కార్మికులు



లక్ష్మణచాందలో చెత్తను సేకరిస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

లక్ష్మణచాంద: కోడి కూతతోనే గ్రామాల్లో విధులు ప్రారంభించేది పంచాయతీ కార్మికులు. పని వేళలతో సంబంధం లేకుండా గ్రామస్తుల అవసరాల మేరకు మల్టీపర్పస్ కార్మికులు విధులు నిర్వహిస్తుంటారు. ఇంటింటా చెత్త సేకరణ, మురుగు కాలువలు శుభ్రం చేయడం, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల నిర్వహణ, వైకుంఠధామాల, తాగునీటి సరఫరా, ట్యాంకులు శుభ్రం చేయడం, విద్యుత్ సరఫరా నిర్వహణ.. ఇలా అన్నిరకల పనులు పంచాయతీ కార్మికులే నిర్వహిస్తారు. వీరికి పంచాయతీలే వేతనం చెల్లిస్తాయి. నెలనెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు జూరైనప్పుడు మాత్రమే వీరికి వేతనాలు చెల్లిస్తున్నాయి. అన్నిరకాల పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులకు భద్రత మాత్రం గాలిలో దీపంలా మారింది. తక్కువ వేతనంతో పనిచేసే కార్మికులకు బీమా సౌకర్యం, శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని పంచాయతీ కార్మికులు అనేకమార్లు సమ్మె చేశారు. సమ్మె సమయంలో సమస్యలు పరిష్కరిస్తామని ఒప్పందం చేసుకుంటున్న పాలకులు తర్వాత పట్టించుకోవడం లేదు. కనీసం బీమా సౌకర్యం కూడా లేకపోవడంతో పంచాయతీ కార్మికులు, వారిపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగి కార్మికుడు ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి.

అమలుకాని గత ప్రభుత్వ హామీ..

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో పంచాయతీ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘకాలం సమ్మె చేశారు. దీంతో ప్రభుత్వం పంచాయతీ కార్మికులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చింది. సమ్మె కాలానికి కూడా వేతనాలు చెల్లిస్తామని తెలిపింది. పంచాయతీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏ హామీ అమలు కాలేదు. ఒకవైపు ఉద్యోగ భద్రత లేకపోగా, మరోవైపు ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయింది.

భద్రత లేని పని...

జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల్లో 1,520 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అటు బీమా సౌకర్యం గానీ ఇటు హెల్త్ కార్డులు గానీ లేవు. దీంతో విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడాల్సిందే అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం అయినా తమ సమస్యలను పరిష్కరించాలని, పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు బీమా సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. హెల్త్ కార్డులు జారీ చేయాలని పనికి తగిన వేతనం నెలనెలా చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు..

- కుంటాల మండలం ఓలా గ్రామానికి చెందిన ఎరుకల గజ్జవ్వ సూర్యాపూర్ గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలుగా పనిచేసేది. 2021, సెప్టెంబర్‌లో సూర్యాపూర్ గ్రామంలో విధి నిర్వహణలో ఉండగా వాహనం ఢీకొట్టి మృతిచెందింది. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు.
- లక్ష్మణచాంద మండలం పీచర గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు సొన్న లింగన్న కొద్ది రోజుల కిత్రం గ్రామంలో చెత్త సేకరించే క్రమంలో ట్రాక్టర్ ఆకస్మాత్తుగా తగలడంతో కాలుకు తీవ్రం గాయమైంది. చికిత్సకు రూ. 10 వేల వరకు ఖర్చయ్యాయి. తనకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదని లింగన్న తెలిపాడు.
- లక్ష్మణచాంద మండల కేంద్రంలో పంచాయతీ కార్మికురాలుగా పనిచేసిన గంగవ్వ అనారోగ్యానికిగురై మృతి చెందింది. ఆమె కుటుంబానికి కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందలేదు.


ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని



గ్రామంలోని వీధి దీపాలు అమర్చే క్రమంలో మా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనులు చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకుని మమ్మల్ని ఆదుకోవాలి.

– నర్సయ్య, పార్‌పెల్లి మల్టీపర్పస్ కార్మికుడు

భద్రత కల్పించాలి



పంచాయతీల్లో పనులను నిర్వహిస్తున్న మాకు భద్రత లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడాల్సిందే. బీమా సౌకర్యంతోపాటు హెల్త్ కార్డులు ఇవ్వాలి.

– పోశెట్టి, మల్లాపూర్, మల్టీపర్పస్ కార్మికుడు

బీమా సౌకర్యం లేదు..



గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించడం లేదు. పోస్టాఫీసుల్లో నెలనెలా రూ.350 చెల్లించి బీమా సౌకర్యం పొందాలి. కార్మికులకు సహజ మరణం సంభవిస్తే బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల సాయం అందుతుంది.

– శ్రీనివాస్, డీపీవో

సర్కారు బడికీ ఫ్రీ కరెంటు

- పాఠశాలలకు ఉచిత విద్యుత్‌పై రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం
- డిజిటల్ విద్యాబోధనకు మరింత సౌలభ్యం
- ప్రత్యేక పోర్టల్ ద్వారా పాఠశాలల అనుసంధానం
- ఉమ్మడి జిల్లాలో 4,116 పాఠశాలలకు ప్రయోజనం

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	ప్రభుత్వ పాఠశాలలు
నిర్మల్	842
ఆదిలాబాద్	1,279
మంచిర్యాల	847
కుమురంభీం	1,148
మొత్తం	4,116



ఎల్ఈడీ తెరపై నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 200 యూనిట్లలోపు గృహావసరాలకు వినియోగించే విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోంది. ప్రభుత్వ విద్యా సంస్థలకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఉపాధ్యాయులు, విద్యావేత్తల నుండి వినతులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలలు, తదితర విద్యా సంస్థలకు వినియోగించే విద్యుత్‌ను కూడా ఉచితంగా అందించేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 4,116 ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం దక్కనుంది. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలోని పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన కోసం ఎల్ఈడీ తెరలు, ప్యానల్ బోర్డులను సమకూర్చింది. ఉపాధ్యాయులకు మార్కుల నమోదు, విద్యార్థుల ప్రగతి వివరాలు, అడ్మిషన్ల వివరాలను నిక్షిప్తం చేసేందుకు ట్యాబ్‌లు కూడా అందించారు. దీంతోపాటు ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగాను ప్రతీ పాఠశాలకు విద్యుత్ కనెక్షన్ అందిస్తోంది. గతంలో వీటి నిర్వహణకుగానూ విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ప్రధానోపాధ్యాయుల నుండి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. పాఠశాల నిర్వహణ గ్రాంట్లు పెద్ద మొత్తంలో కరెంటు బిల్లుల చెల్లింపుల కోసమే వినియోగించేవారు. స్కూల్ గ్రాంట్లు కూడా సకాలంలో విడుదల కాకపోవడంతో వేల రూపాయల కరెంటు బిల్లులు బకాయిల రూపంలోనే ఉండిపోయేవి. ఉచిత విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించడంతో డిజిటల్ విద్యా బోధన పూర్తిస్థాయిలో కొనసాగేందుకు అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇక నుంచి జీరో బిల్లులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వరంగంలో ప్రాథమిక, ఉన్నత తదితర పాఠశాలలు 4,116 ఉన్నాయి. నిర్మల్ జిల్లాలో 842, ఆదిలాబాద్ జిల్లాలో 1,279, మంచిర్యాల జిల్లాలో 847, కుమురంభీం జిల్లాలో 1,148 పాఠశాలలు ఉన్నాయి. ఉచిత విద్యుత్‌ను అందించనుండడంతో ఇక నుంచి ప్రతినెల మీటర్ రీడింగ్ తీసి జీరో బిల్లులు అందజేయనున్నారు. విద్యుత్ దుర్వినియోగం కాకుండా వీటిపై ప్రభుత్వ, విద్యుత్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. బిల్లుల మొత్తాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులకు అందిస్తే వారు విద్యుత్ శాఖ వారికి చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థ పాఠశాలలకు అందించే ఉచిత విద్యుత్ వివరాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసి ఆయా ప్రభుత్వ పాఠశాలలను అనుసంధానం చేయనున్నారు.

డిజిటల్ బోధనకు మార్గం సుగమం

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రెండేళ్ల నుంచి తరగతి గదుల్లో వినియోగించే డిజిటల్ ప్యానెల్ బోర్డులు, ఎల్ఈడీ తెరలు, ప్రొజెక్టర్లు, మైక్‌సెట్‌లు, ఫ్యాన్లు, లైట్లు వంటివి అందుబాటులోకి వచ్చాయి. అయితే వీటికి విద్యుత్ వినియోగం భారమవుతుందనే ఉద్దేశంతో ప్రతీరోజు బోధనాభ్యసనలో వినియోగించేందుకు ఉపాధ్యాయులు వెనుకాడేవారు. ప్రస్తుతం ఉచిత విద్యుత్ అందించనున్న నేపథ్యంలో వీటి పూర్తిస్థాయి వినియోగానికి మార్గం సుగమమైంది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సముచిత నిర్ణయం



ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందివ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం సముచితమైనది. గతంలో పాఠశాల గ్రాంట్లలో 80 శాతం నిధులను కరెంటు బిల్లులు చెల్లించేందుకే వినియోగించాల్సివచ్చేది. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వడంవల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుంది. – టి.నరేంద్రబాబు, పీఆర్టీయూటీఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

ఒకరి ప్రాణాలు కాపాడిన పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఆత్మహత్యకు పాల్పడుతున్న ఒకరి ప్రాణాలు కాపాడి పోలీసులు మానవత్వం చాటుకున్నారు. మహాలక్ష్మివాడలోని ఓ ఇంట్లో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. స్థానికుల ఫిర్యాదుతో క్షణాల్లో అక్కడికి వచ్చిన పోలీసులు ఉరితాడును తొలగించి ప్రాణాలు కాపాడారు. బాధితుడి భార్య అతనితో గొడవపడి పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది రాథోడ్ అనిల్, అజహార్ ఖాన్, తిలక్, శివప్రసాద్ పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

ఎదులాపురం: పట్టణ వన్‌టౌన్ పోలీసులు గురువారం రూ.2,10,500 విలువ చేసే గుట్కాను పట్టుకున్నట్లు ఏఎస్సై గంగాధర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పట్టణంలోని ఖుర్షాపూర్‌లో గల కరణ్ ట్రేడర్స్‌లో తనిఖీ చేపట్టగా నిషేధిత గుట్కా లభించింది. పట్టణానికి చెందిన షేక్ అక్తర్, ఇఫ్తకార్, సల్మాన్ స్థానిక అస్లాం ట్రేడర్స్ నుంచి గుట్కా తీసుకొచ్చి దందా నడుపుతున్నారన్నారు. గుట్కాను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న తునికాకు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న తునికాకు

బోథ్: మండలంలోని కుచులాపూర్ బస్టాండ్ సమీపంలో గురువారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు రూ.50 వేల విలువైన తునికాకు పట్టుకున్నట్లు డిప్యూటీ రేంజ్ అధికారి సుందర్ తెలిపారు. ఉట్నూరు నుండి కుచులాపూర్, దన్నూర్ మీదుగా తునికాకు కట్టలతో సారంగాపూర్ మండలానికి వెళ్తున్న రెండు ఆటోలను కుచులాపూర్ వద్ద పట్టుకుని ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుకున్న వారిలో బీట్ అధికారులు నాగరాజ్, కోసేరావు, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

లక్ష్మణచాంద: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని చామన్‌పెల్లిలో చోటు చేసుకుంది. రాపెల్లి పెద్ద సాంబయ్య అనే రైతుకు చెందిన గేదె గురువారం ఉదయం గ్రామ సమీపంలో మేతకు వెళ్లింది. మేత మేస్తుండగా విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

సినీఫక్కీలో చోరీ



యజమానితో మాట్లాడుతున్న దుండగుడు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ బంగారం దుకాణంలో గురువారం సినీఫక్కీలో చోరీ జరిగినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి దుకాణం ఎదుట ఆపారు. అందులోంచి ఒకరు దుకాణంలోకి వెళ్లి మెడలో వేసుకునే బంగారు లాకెట్ చూపమని దుకాణం యజమాని వనితను అడిగాడు. రూ.3వేల విలువగల లాకెట్‌కు రూ.వెయ్యి అడ్వాన్సుగా ఇచ్చాడు. మళ్లీ వచ్చి మిగతా రూ.2వేలు ఇచ్చి లాకెట్ తీసుకెళ్తానని నమ్మబలికాడు. ఇలా యజమానితో మాట్లాడుతునే కౌంటర్‌లో ప్లాస్టిక్ ప్యాకెట్ కవర్లో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు చేతి వేళ్ల మధ్యలో పెట్టుకుని బైక్‌పై పరారయ్యారు. యజమాని ఫిర్యాదుతో పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించగా దుండగులు శివాజీ చౌక్ నుంచి నంబర్‌ప్లేట్‌లేని బైక్‌పై వచ్చి ఆదిలాబాద్‌వైపు వెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్ స్నాచింగ్ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

కైలాస్‌నగర్: తాంసి, బేల పోలీసు స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. గురువారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుడిహత్నూర్ మండలం మన్నూర్‌కు చెందిన హోలాంబే అవినాష్, అదే గ్రామానికి చెందిన గిత్తే విభాష్ అలియాస్ విభస్, బజార్‌హత్నూర్‌కు చెందిన జాదవ్ ప్రదీప్‌తో పాటు ఓ బాలుడు జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 21న సిర్సన్న గ్రామ శివారులోని పంట పొలంలో మహిళ మెడలో నుంచి అవినాష్, విభాష్‌లు బంగారు గొలుసు లాక్కెళ్లి ప్రదీప్‌కు రూ.5,500లకు విక్రయించారు. 22న తాంసి మండలం హస్నాపూర్ సమీపంలో రోడ్డుపై ఒంటరిగా ఉన్న రాజమ్మను బెదిరించి బంగారు గొలుసు లాక్కెళ్లి ప్రదీప్‌కు విక్రయించారు. నిందితులను అరెస్టు చేసి 10 గ్రాముల పుస్తెలతాడు, 10 గ్రాముల బంగారు గుండ్లతాడు, బజాజ్ పల్సర్ బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో రూరల్ సీఐ ఫణిదర్, సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, సిబ్బంది శ్రీనివాస్, జోగిందర్ సింగ్, జైనథ్ సీఐ సాయినాథ్, తాంసి ఎస్సై శివరాం, బేల ఎస్సై రాధిక, తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో 20 ఏళ్ల జైలు

నేరడిగొండ: ఏడేళ్ల బాలుడిపై జరిగిన అసహజ అత్యాచార నేరం కేసులో నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు జడ్జి శివరామ ప్రసాద్ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. 2021 జూన్ 2న నేరడిగొండలో ఏడేళ్ల బాలుడిపై శివరాత్రి మహేష్ అనే వ్యక్తి అసహజ అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటి ఎస్సై భరత్ సుమన్ కేసు నమోదు చేయగా ఉట్నూర్ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి పరిశోధన చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

చోరీ కేసులో ముగ్గురికి కఠిన కారాగార శిక్ష

భైంసాటౌన్: ఎనిమిది దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ భైంసా కోర్టు న్యాయమూర్తి డి.దేవేంద్రబాబు గురువారం తీర్పునిచ్చారు. పట్టణానికి చెందిన సోనాకాంబ్లే విజయ్, దగడే వికాస్, సద్దాం హుస్సేన్‌లపై ఉన్న ఎనిమిది చోరీ కేసులు కోర్టులో విచారణకు రాగా లైసన్ అధికారి ఫిర్దోస్ సాక్షులను ప్రవేశపెట్టారు. నేరాలు రుజువు కావడంతో వారికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు

ఇచ్చోడ: ఒకరి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ బోథ్ మున్సిఫ్ కోర్టు జడ్జి హుస్సేన్ గురువారం తీర్పునిచ్చినట్లు ఇచ్చోడ ఎస్సై నరేష్ తెలిపారు. 2019లో చౌహాన్ శ్రీనివాస్ అజాగ్రత్తగా ఆటో నడిపి అదేగామ గ్రామానికి చెందిన నల్లతీగాల కొండన్నను ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా, లైసెన్స్‌లేని వ్యక్తికి ఆటో ఇచ్చినందుకు ఓనర్‌కు మూడునెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి హుస్సేన్ తీర్పునిచ్చారు.

ఒకరికి 14 రోజుల రిమాండ్

భైంసా: అడవి పందులు తరలిస్తున్న దిలీశ్‌కుమార్ అనే వ్యక్తికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ భైంసా మెజిస్ట్రేట్ దేవేంద్రబాబు గురువారం తీర్పునిచ్చారు. అటవీశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఏలూరు జిల్లాకు చెందిన దిలీశ్‌కుమార్ భైంసా మండలం దేగాంలో బుధవారం రాత్రి అడవి పందులను తరలించేందుకు సిద్ధమయ్యాడు. ముందస్తు సమాచారంతో డీఆర్‌వో ఐర్వా నొద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు బెనిన్, హారిలత, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ అతన్ని అదుపులోకి తీసుకుని భైంసా కోర్టులో హాజరు పరిచారు. భైంసా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.

జీపీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపల్లి గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ బ్యాటరీ చోరీకి గురైనట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు. బ్యాటరీ విలువ సుమారు రూ.8 వేలు ఉంటుందని తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

ఆదివాసీ మహిళకు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆత్రం సుశీల

బోథ్: మండలంలోని బాబేర గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ ఆత్రం సుశీల గోల్డెన్ నంది అవార్డు, గోల్డెన్ ఇన్‌స్పైర్ అవార్డు అందుకున్నారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నారు. సుశీల మహిళా సంఘం సభ్యురాలిగా ఉంటూ, గ్రామాల్లో విద్య, వైద్యం, శుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. గతంలో కూడా గవర్నర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నిర్మల్ కవికి యువ పురస్కారం



పోలీస్ భీమేష్

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర సాహితీ సంస్థ తెలంగాణ సారస్వత పరిషత్తు ఏటా అందజేస్తున్న పురస్కారానికి ఈ ఏడాది జిల్లాకు చెందిన పోలీస్ భీమేష్ ఎంపికయ్యారు. 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే తొలి పుస్తకంతో యువ పురస్కారానికి ఎంపికైనట్లు సంస్థ బుధవారం ప్రకటించింది. యువకవి గా, శిల్పిగా, చిత్రకారుడిగా బహుముఖ ప్రజ్ఞ చాటుతున్న నిర్మల్ రూరల్ మండలం అనంతపేట గ్రామానికి చెందిన భీమేష్ సాహిత్యంలోనూ రాణిస్తున్నారు. తన రచనల సమాహారాన్ని 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవితా సంపుటిగా పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహకారంతో ప్రచురించారు.

చట్టాలు.. సరికొత్తగా..

- జూలై 1 నుంచి అమలు
- ఫిర్యాదుల నుంచి సమన్ల జారీ వరకు అన్నీ ఆన్‌లైన్‌లోనే..
- సత్వర న్యాయానికి రెండే వాయిదాలు
- హేయమైన నేరాల దృశ్యాలకు వీడియోగ్రఫీ తప్పనిసరి
- పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా జీరో ఎఫ్ఐఆర్
- అధికారులు, సిబ్బందికి పది రోజుల పాటు శిక్షణ




శిక్షణ తరగతుల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

నిర్మల్‌టౌన్: జీరో ఎఫ్ఐఆర్, ఫిర్యాదులు, సమన్ల జారీ వంటివన్నీ ఇకపై ఆన్‌లైన్ ద్వారానే జరుగనున్నాయి. దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి చట్టాలలో భారీ మార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), సీఆర్పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో ప్రభుత్వం భారీ మార్పులు చేసింది. 'భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత-2023, భారతీయ సాక్ష్య అధినియమ్-2013గా మార్చింది. ఈ కొత్త చట్టాల అమలులో పలు మార్పులు కనిపించనున్నాయి. ఇకపై అన్నీ ఎలక్ట్రానిక్ మాధ్యమంలోనే జరగనున్నాయి. హేయమైన నేరాలకు సంబంధించిన నేర దృశ్యాలను తప్పనిసరిగా వీడియోగ్రఫీ చేస్తారు. ఈ కొత్త చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 18 నుండి 28 వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లాలోని 20 పోలీస్ స్టేషన్లో పరిధిలోని 508 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణకు సమన్వయ అధికారిగా డీసీఆర్బీ సీఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ రవికుమార్, శిక్షకులుగా సీ ఐలు నవీన్ కుమార్, సైదారావు, ఎస్సైలు సాయి కుమార్, సాయి కిరణ్, జ్యోతిమని వ్యవహరించారు.

కొత్త చట్టాలు ఇవే..

- బాధితుడు ఇకపై నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేయవచ్చు.
- జీరో ఎఫ్ఐఆర్ ప్రకారం ఎవరైనా పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చు.
- అరెస్టయిన బాధితుడు విషయాన్ని తన స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులకు తెలియజేసే వీలుంటుంది. దీనివల్ల బాధితుడికి తక్షణసాయం లభిస్తుంది. అరెస్ట్ వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు, జిల్లా హెడ్ క్వార్టర్‌లో బహిరంగంగా ప్రదర్శిస్తారు. దీనివల్ల బాధిత కుటుంబ సభ్యులు, స్నేహితులకు ముఖ్యమైన సమాచారం తెలిసే వీలుంటుంది.
- హేయమైన నేరాల్లో వీడియోగ్రఫీ తప్పనిసరి. దీనివల్ల దర్యాప్తులో నాణ్యత పెరిగే అవకాశం ఉంది.
- మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు రెండు నెలల్లోనే పూర్తి కావాలి. బాధిత మహిళలు, చిన్నారులకు ఉచితంగా ప్రాథమిక చికిత్స, వైద్య చికిత్స అందించాల్సి ఉంటుంది.
- సమన్లను ఇకపై నేరుగా వెళ్లి ఇవ్వాల్సిన పనిలేదు. ఆన్‌లైన్‌లో పంపించవచ్చు. తద్వారా పేపర్ వర్క్ తగ్గించి, అన్ని భాగస్వామ్య పక్షాల మధ్య సమాచారం అందించేలా ఈ చట్టాన్ని రూపొందించారు.
- మహిళలపై నేరాల విషయంలో బాధితురాలి వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్ ఎదుట నమోదు చేయాలి. వారు లేనిపక్షంలో మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాలి.
- బాధితులతో పాటు నిందితులకు కూడా ఎఫ్ఐఆర్ కాపీ నకలును ఉచితంగా అందిస్తారు. పోలీస్ రిపోర్ట్, ఛార్జిషీట్, స్టేట్‌మెంట్లు, ఇతర డాక్యుమెంట్లను 14 రోజుల్లో పొందవచ్చు.
- సాక్షుల భద్రతను వారి సహకారాన్ని దృష్టిలో ఉంచుకొని, సాక్షుల పరిరక్షణ పథకాన్ని ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేయాలి.
- అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి.
- మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు 15 ఏళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. వారు తాము నివసిస్తున్న చోటే పోలీసుల సాయం పొందవచ్చు.
- స్వల్ప నేరాలకు సంబంధించి నేరస్తులకు సమాజ సేవ చేసే అవకాశాన్ని కొత్త చట్టాలు కల్పిస్తున్నాయి.
- న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించడంతో పాటు వేగంగా కేసుల పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో ఈ చట్టాలు రూపొందించబడ్డాయి.

పోలీసులకు అవగాహన ఉండాలి



కొత్త చట్టాలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలి. అప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించగలుగుతారు. అమలు జరిగిన వెంటనే ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరం. అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి ఆయా సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని అవసరాన్నిబట్టి ప్రజా భద్రతకోసం చట్టాలను రూపకల్పన చేయడం జరిగింది. కొత్త చట్టాలపై జిల్లా పోలీసులకు విడతల వారీగా శిక్షణ తరగతులు నిర్వహించాం. – జానకీ షర్మిల, నిర్మల్ ఎస్పీ

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

తాంసి: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు భీంపూర్ ఎస్సై ఎండీ కలీమ్ తెలిపారు. తాంసి(కె) గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 25న రాత్రి 12 గంటల సమయంలో మూత్రవిసర్జన కోసం బయట కొట్టంలోకి వెళ్లగా అదే గ్రామానికి చెందిన రవీందర్ అనే వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు మహిళ భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ఇంటి భోజనం తింటున్న విద్యార్థులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు విచ్చేసి భోజనాన్ని పరిశీలించారు. ఇక నుంచి అలా జరగకుండా చూసుకుంటామని మధ్యాహ్న భోజన కార్మికులు తెలపడంతో శాంతించారు. ఇలా జరగడంతో కొందరు విద్యార్థులు గురువారం ఇంటి నుంచి భోజనం తెచ్చుకోవడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.